మన్మథరావుకి జుట్టు పీక్కోవాలనిపించింది. పీక్కున్నాడు.

లెక్క ప్రకారం అయితే జుట్టు పీక్కున్న వాడు తరవాత చేయవలసిన పని బుర్ర బద్దలు కొట్టుకోవటం.

అయితే మన్మథరావు బుర్ర బద్దలు కొట్టుకో లేదు. కానీ బుర్ర బద్దలు అయ్యేలా ఆలోచించటం మొదలు పెట్టాడు.

మన్మథరావు యం. ఏ.

బాగుంది.

అతను ఫలానా కాలేజీలో లెక్చరరు.

ఇంకా బాగుంది.

అతను రతీదేవి లాంటి సుశీల మెడలో తాళి కట్టి మూడు నెలల కిందట కొత్త కాపురం పెట్టాడు.

మరీ బాగుంది.

మరి ఇన్ని మార్కులు పొందిన మన్మథరావు బుర్ర బద్దలు అయ్యేలా ఆలోచిస్తున్నాడంటే విద్యార్థులలో క్రమశిక్షణ తగ్గిపోయినందుకా? కాదు.

తెలుగు దేశంలో విద్యా ప్రమాణాలు పడిపోయినందుకా?

అదీ కాదు.

తను అమెరికా వెళ్ళి ఇంకా పై చదువులు చదవ లేకపోయినందుకా?

అంతకంటే కాదు.

మరి అతని కొచ్చిన సమస్య ఏమిటి?

అతని కే సమస్యా లేదు. కానీ తనకు తానే ఒక సమస్యను సృష్టించుకున్నాడు.

ఆ సమస్య పేరు "చంచల".

చంచల మన్మథరావుకి మరదలు. సుశీలకి అక్క రాలా చెల్లెలు.

సరిగ్గా క్రితం రోజు సాయంకాలం అయిదు గంటలకు కాలేజీ నుంచి రాగానే తమ ఇంటిలో ఒక కొత్త వ్యక్తి ఉన్నట్లు గమనించి వెంటనే గదిలోకి వెళ్ళటానికి సంకోచించాడు.

"పై వాళ్ళు ఎవరో కాదు. లోపలికి రండి. మా చెల్లెలు చంచల వచ్చింది" అంది సుశీల.

మన్మథరావు గదిలోకి అడుగు పెడుతూనే కొయ్యబారిపోయాడు.

చంచల అనన్య సామాన్యమైన సౌందర్యవతి. ఆమె అంద చందాలు వర్ణిస్తూ పోయేకంటే ఆమెను "ఊర్వశి"తో పోలిస్తే సరిపోయేది.

తన కో మరదలుందని తెలుసు. కానీ ఆమె ఇంత అందగత్తె అనే విషయం తెలియదు.

తన పెళ్ళి విషయం చాలా హడావిడిగా జరిగిపోయింది. పెళ్ళి అయిన వెంటనే సుశీలను తెచ్చుకుని హైదరాబాదులో కాపురం పెట్టి "సంసారం అంటే స్వర్గం" అనే సత్యాన్ని ఇప్పుడిప్పుడే రుచి చూస్తున్నాడు.

చంచల తిరుపతిలో తన మేనమామగారింటిలో ఉంటూ బి. ఏ. చదువు తూండేది. అప్పట్లో ఆమెకు పరీక్ష లుండటంతో తన పెళ్ళికి రాలేకపోయింది. దానా దీనా, మన్మథరావు చంచలను చూడటం ఇదే ప్రథమం.

చంచలను చూసిం తరవాత మన్మథరావుకి తన తప్పు తెలిసి వచ్చింది.

పెళ్ళికి ముందు చంచలను తను చూడక పోవటం ఒక పెద్ద పొరపాటు. ఆ పొరపాటు వల్ల తనకి ఎంతో నష్టం జరిగింది.

తను సుశీలను పెళ్ళి చేసుకోవటమే ఒక పొరపాటు.

ఆ పొరపాటు సరిదిద్దుకో లేకపోవటం పెద్ద నష్టం.

ఆ నష్టం పూడ్చుకునే ఉపాయం కనపడుతుం

చేసి ఆమెను తనదాన్ని చేసుకోవాలని మరుక్షణమే నిర్ణయించుకున్నాడు. అయితే ఆ "ఏదో ఒకటి" అనేది ఏమిటో అంతు పట్టటం లేదు.

అంతు పట్టని ఆ "ఏదో ఒకటి" కోసం మన్మథరావు బుర్ర బద్దలు అయ్యేలా ఆలోచిస్తున్నాడు.

* * *

చంచలకి కళ్ళు మూతలు పడటం లేదు. బలవంతాన మూసినా కళ్ళ ముందు మన్మథరావు ముఖమే కనబడుతూంది.




దేమోనని మన్మథరావు ముందు చంచల ముఖంలోకి చూశాడు. ఆమె "రంభలా" కనపడింది. చంచలను చూసిన కళ్ళతోనే సుశీలను చూశాడు. సుశీల రంభకి పరిచారికలా అనిపించింది.

"తెలివైన వాడెవ్వడూ "రంభ" ను వదిలి ఆమె పరిచారికను కావాలనుకోడు" అనుకున్నాడు. కానీ తను చేసింది అక్షరాలా అదే.

అయిందేదో అయింది ఇప్పుడు "రంభ" ను మాత్రం తను వదులుకో కూడదు. "ఏదో ఒకటి"

తన బావ పేరు మన్మథరావని తెలుసుకానీ అతను నిజంగా మన్మథుడనే విషయం తనకి ఈ నాడే తెలిసింది.

అక్కకి పెళ్ళి చూపులు జరుగులాయని తండ్రి లెటరు వ్రాసినప్పుడైనా తను ఇంటికి వచ్చి ఉండాల్సింది. అప్పుడు తను చదువు మైకంలో పడి పోయింది. కానీ అప్పుడే మన్మథరావుని తను చూసి ఉంటే, అతన్ని చేజారి పోనిచ్చేది కాదు.

అసలు తనకి "ఆ ఊహ" వచ్చినప్పటినుంచి

ఒక రూపం తను మనసులో ముద్రపడి పోయింది. అలాంటి రూపం కల వారికోసం ఇన్నాళ్ళూ తను వరితపిస్తూ౦ది. కానీ ఇవాళ ఆ రూపానికి నిజ రూపంగా "మన్మథరావు" కనబడటంతో తనకి వళ్ళు పులకరించి పోయింది. కాళ్ళు తేలిపోయాయి. కానీ ఆ మన్మథరావు తన అక్కకి "సొంతం" అన్న సంగతి గుర్తు వచ్చి గొంతునిండా దుఃఖం పూడుక పోయింది.

అక్కకి పెళ్ళిచూపుల నాడూ తను తిరుపతినుంచి ఇంటికి వచ్చి ఉంటే — ఎలాగైనా ఈ "మన్మథుణ్ణి" తనవాడిగా చేసుకునేది. అక్కకి మరో సంబంధం తెచ్చి ఉండేవారు నాన్నగారు.

అయిందేదో అయింది.

అయిపోయిందానికోసం ఆరాట పడటం కంటె, పోయిందాన్ని తిరిగిపొందటం కోసం తను "ఏదో ఒకటి" చేసి తీరాలి.

ఆ ఏదో ఒకటి ఏమిటో అంతుపట్టే వరకూ తనకి కళ్ళు మూతలు పడవు.

•  •  •

సుశీలకి మెలకువ వచ్చింది.

గదంతా చీకటిగా ఉంది.

ప్రక్కనే తడిమి చూసుకుంటే భర్త లేడు.

ఈ సమయంలో మన్మథరావు ఏమైనట్లు? బహుశా బాత్ రూంకి వెళ్ళి ఉండాలి. బాత్‌రూమ్‌కి వెళ్ళిన వ్యక్తి ఇంకా తిరిగి రాక పోవటం ఏమిటి? సుశీలకి అనుమానం కలిగింది.

అసలు అతని ప్రవర్తనే నిన్నటినుంచి అనుమానా స్పదంగా ఉంది.

చంచల వచ్చినప్పటి నుంచి ఆయన ప్రవర్తన అదో రకంగా ఉంది. దాదాపు తనని మరిచిపోయారు.

తొలి పరిచయంలోనే, యుగాలు తరవాత కలుసు కున్న ప్రేయసి ముఖంలోకి చూస్తున్నట్లుగా చూశారు చంచల్ని. తను ఇంతకాలం ఎదురు చూస్తున్నది చంచలకోసమే నన్నట్లుగా అంత కాంక్షతో దాని ముఖంలోకి చూడటం ఏమిటి?

అంతేకాక పరిచయాలప్పుడూ — ప్రేయసి ప్రియులు ఒకరి నొకరు బిగి కౌగిలిలోకి జారు కుంటున్నట్లుగా, ఆ చంచల, ఈయన ఒకరి కళ్ళ లోకి ఒకరు చూసుకుంటూ అలా దగ్గరకు జరగటం ఏమిటి? వాళ్ళిద్దరి మధ్యకి తను వెళ్ళి నుంచోబట్టి సరిపోయింది కానీ ఆ సమయంలో తను లేకపోతే నిజంగా ఏం చేసి ఉండేవారో?

పెళ్ళి అయిన ఈ మూడు నెలల నుంచీ, నువ్వే నా ప్రాణం, నువ్వే నా జీవితం, నువ్వే నా దేవతవు అంటూ ప్రేమ పాటాలు వల్లించిన ఈ పెద్దమనిషి కంటికి నదరుగా మరో కుర్రది కనబడగానే వళ్ళు మైమరిచిపోవటం ఏమనాలి?

తన కళ్ళ ముందరే ఇన్ని వేషాలు వేస్తున్న వీళ్ళు ఇద్దరూ రేపు తను లేనప్పుడు ఎలాంటి "చాటు వ్యవహారం" అయినా నడపవచ్చు.

"ఉస్మానియా యూనివర్సిటీలో ఎం. ఏ. చదువు తాను. పడిగ్గున్న విషయంలో యూనివర్సిటీకి వెళ్ళాలి" అంది చంచల. మరి ఈయన దాన్ని వెంటేసుకుని తిరగవచ్చు. వాళ్ళు అలా, అలా మరింత "దగ్గర" అయి, తనని "దూరం" చేయరని గారంటీ ఏమిటి?"

పరిస్థితి చే జారిపోకముందే తను "ఏదో ఒకటి" చేసెయ్యాలి. ఆ "ఏదో ఒకటి" ఏమిటో అంతు పట్టక సుశీల తన్నుకుంటూండగా మన్మథరావు లోపలికి వచ్చాడు.

వచ్చి సుశీల పక్కన చోటు చేసుకున్నాడు.

చోటు చేసుకుని సుశీలని దగ్గరకు లాక్కోలేదు. లాక్కోపోయినా తను భర్తకి దగ్గరగా జరిగింది.


•  •  •

తెల్లవారింది.

మన్మథరావు ఫుల్ మేకప్‌తో తయారు అయ్యాడు. చంచల పుస్తకాలు తోసి రాజంటూంది.

మన్మథరావు స్కూటరు బయటకు తీశాడు. చంచల "స్కూటరు ఎక్కను" అంటే అప్పుడే ఆలోచించవచ్చులే అనుకున్నాడు.

"అక్కని తోడుచేసుకుని యూనివర్సిటీకి



సౌందర్యం — ఫోటో: యం. ప్రసాద్

వెళ్ళిరా. నాకు కాలేజీకి టైము అయింది" అని బావ ఎక్కడ అంటాడో అని చంచల హైరాన పడి పోయింది.

"చంచలకి యూనివర్సిటీ చూపించి నేను అటు కాలేజీకి వెళ్తాను. పని అయిపోగానే చంచల 'సిటీబస్సు' లో ఇంటికి వస్తుంది" అన్నాడు సుశీలతో మన్మథరావు, స్కూటరుతోపాటు తన సరికం కూడా "స్టార్టు" చేస్తూ.

చంచల ఏనుగెక్కినంత సంబరంగా స్కూటరు మీద కూర్చుంది.

ఇద్దరూ ఒకేసారి చేతులు వూపుతూ సుశీలకి టా—టా చెప్పారు. ఇద్దరు తన చేజారిపోతున్నట్లు అనిపించింది సుశీలకి.

•  •  •

స్కూటరు రోడ్డు మీద పరుగెడుతోంది.

రోడ్డు మీద అవరోధం కలిగినప్పుడల్లా స్కూటరు వేగం తగ్గుతోంది.

వేగం తగ్గినప్పుడల్లా తను బాలన్సు నిలుపు కోవటం కోసం మన్మథరావు బుజం మీద చెయ్యి వేసేది చంచల. చెయ్యి వేసినప్పుడల్లా తన లేప్రతి చంచల శరీర భాగాలు మెత్తగా తగులుతూంటే మన్మథరావుకి స్వర్గలోకంలో విహరిస్తున్నట్లుగా ఉంది.

మళ్ళీ రోడ్డు క్లియరు అయి, స్కూటరు వేగం పుంజుకుంటే చంచల చెయ్యి తీసివేసేది. చంచల చెయ్యి తియ్యగానే స్వర్గలోకంలో విహరిస్తున్న మన్మథరావుకి తనను ఎవరో హైదరాబాద్ నడి రోడ్డు మీద విసిరేసినట్లు నిపించసాగింది.

తనకి స్వర్గంలో విహారం కావాలనిపించినప్పుడు అవసరం లేకపోయినా, స్కూటరు వేగం తగ్గించి ప్రయాణంలో ఆపోకర్యం సృష్టించడం మొదలు పెట్టాడు.

అవసరం లేకపోయినా చంచల కూడా పర్మ నెంటుగా బావ పొట్ట చుట్టూ తన కోమలమైన చెయ్యి వేసి, అతని వీపుకి అంటిపెట్టుకు ఉండి పోయింది.

క్రమంగా చంచల మనసు మన్మథరావుకి అర్థం అయింది. బావ స్కూటరు నడిపించిన తీరుకి అర్థం ఏమిటో చంచలకి తెలిసిపోయింది.

యూనివర్సిటీ చేరుకునే లోపలే ఇద్దరికీ ఒకరి మనసు ఒకరికి తేటతెల్లం అయిపోయింది. ఇంత సేపూ "ఎలాగ" అని కొట్టుకు చచ్చిన ఇద్దరికి పరిష్కారమార్గం ఇట్టే దొరికిపోయింది.

ఒక్కమాట మాటాడకుండానే వేయిమాటలలో గల భావం ఇద్దరూ ఒకరికొకరు వ్యక్తపరచుకో గలిగారు.


ఒక్క ఇరవై నిముషాల ప్రయాణంలో ఇరవై యుగాల నుంచి ఇద్దరూ ఒకటే అనే అవగాహనకి ఇద్దరూ వచ్చారు.

ఇక ఇంకా చెప్పుకోవలసింది ఏమీ లేదు.

ఇక మాటాడుకోవలసింది అంతకంటే లేదు.

ఇద్దరికీ అర్థం కానిది కొంచెం కూడా లేదు.

ఇంకా అర్థం చేసుకోవలసింది అసలు లేదు.




యూనివర్సిటీ వచ్చింది.

స్కూటరు యూనివర్సిటీ దాటి పోయింది. దాటి ఒక పార్కు ముందు ఆగింది. ఇద్దరూ దిగారు. దిగి ఒకరినొకరు ప్రేమతో చూసుకున్నారు. చేతిలో చెయ్యి వేసుకుని ఇద్దరు పార్కులోకి నడిచారు. నడిచి ఒక పొదమాటుకి చేరుకున్నారు.

"మనం పెళ్ళి చేసుకుందాం చంచలా" అన్నాడు మన్మథరావు ఎలాంటి ఉపోద్ఘాతం లేకుండానే.

"ఎప్పుడు" అంది చంచల అతని కళ్ళలోకి కాంక్షగా చూస్తూ.

"ఎల్లుండి యాదగిరి గుట్టకు వెళ్ళి అక్కడే గుళ్ళో పెళ్ళి చేసుకుందాము."

"ఎల్లుండిదాకా ఎందుకు రేపే వెళితే" అంది చంచల ఆరాటంగా.

"రేపు మా కాలేజీలో పెద్ద ఫంక్షను ఉంది. దానికి నేను ముఖ్య కార్యకర్తను. ఆ సందర్భంలో రేపంతా నాకు తీరుబడి ఉండదు ఎల్లుండి వెళ్తాము.'

"ఆ పని ఎవరికైనా అప్పగించరాదూ. ఎల్లుండి వరకూ నేను ఆగలేను" అంది చంచల.

"అలాగా! ఈ దీనుడి మీద ఇంత ప్రేమ ఉంటే, ఇన్నేళ్ళ నుంచీ ఎందుకు కనబడలేదు.''

"ఇప్పుడుకనపడ్డాగా, ఇంకా ఆలస్యం ఎందుకు?"

"తప్పదు మరి. ఒక్క రోజు ఆగితే మనకు అడ్డు లేదు."

"అడ్డు అంటే గుర్తు వచ్చింది. అక్కకి మన విషయం తెలిస్తే" అంది చంచల ఖంగారు పడుతూ.

"ముందు తెలిస్తే గొడవ చేస్తుంది, కాబట్టి పెళ్ళి చేసుకుని తరువాత చెప్తే, ఆపైన చేయగలిగింది ఏమీ ఉండదు."

"ఎన్నింటికి వెళ్దాం"

"ఉదయం ఎనిమిది గంటలకు యూనివర్సిటీకని ఇద్దరం బయలుదేరుదాం. పెళ్ళి చేసుకుని సాయంకాలానికి తిరిగివద్దాము. ఏమంటావు?"

"ఓ.కే." అంది చంచల.

ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు.

తను తిన్నగా కాలేజీకి వెళ్తానన్న విషయంగానీ, చంచల సిటీ బస్‌లో వస్తుంది అని చెప్పిన విషయంగానీ ఇద్దరికీ గుర్తు లేదు.

కానీ సుశీల మరచిపోలేదు.

ఇద్దరూ కలిసి ముసిముసినవ్వులు నవ్వుకుంటూ స్కూటరు దిగుతూంటే, ఇద్దరూ ఏదో కుంభకోణం జరిపినట్లు సుశీలకి అనుమానం కలిగింది.

* * *

ఈరోజు మా కాలేజీలో ఫంక్షను ఉంది. పగలు ఆబిడ్సులో డెకరేటివ్ సామాను కొనాలి. ఫంక్షను అయ్యే సరికి రాత్రి చాలా పొద్దుపోతుంది. ఇంటికి ఆలస్యంగా వస్తాను" అని చెప్పి మన్మథరావు స్కూటరు మీద వెళ్ళిపోయాడు.

సుశీల మనసు చకచకా పని చేయనారంభించింది.

ఒక గంట తరువాత చంచలను తీసుకుని ఆబిడ్సు బయలు దేరింది. తను వూహించిన విధంగానే మన్మథరావు కోమలితో ఒక పెద్ద షాపులో ఏదో కొంటున్నాడు.

కోమలి మన్మథరావు కో—లెక్చరర్. ఆమె ఒకసారి తన ఇంటికి వచ్చింది. ఈ ఫంక్షనుకు ఆమె కూడా తోటి కార్యకర్త. ఈ విషయం అతనే ఒకసారి సుశీలతో చెప్పాడు.

"ఆ షాపులో మీ బావగారి ప్రక్కన ఉన్న స్త్రీని గమనించు" అంది సుశీల చంచలతో, దూరాన్నించి వారిద్దరినీ చూపిస్తూ.

"ఎవరామె" అంది చంచల ఆశ్చర్యపోతూ.

"ఆమె పేరు కోమలి. మీ బావగారి కొలీగ్. నా పెళ్ళికి ముందు నుంచీ ఆమెతో ఈయనకి పరిచయం ఉంది. ఇద్దరూ కలిసి తిరుగుతూ ఉంటారు. మా సంసారం చూసి నువ్వు ఎంతో ముచ్చటపడుతూ ఉండవచ్చు, కానీ ఇప్పుడు నేను చిల్లు పడిన నావలో ప్రయాణం చేస్తున్నాను. ఏ క్షణంలోనైనా మునిగిపోవచ్చు" అంది సుశీల ఎంతో నేర్పుగా, గొంతునిండా దుఃఖం తెచ్చుకుని.

చంచల మౌనంగా వింది.

"నువ్వు మీ బావగారికి ఎలాగైనా నచ్చచెప్పు చంచలా. ఈ విషయంలో నేను ఎంత ప్రాధేయపడినా వినిపించుకోవటం లేదు. నీ మాటమీదనైనా ఆయన మారితే, నా జీవితం బాగుపడుతుంది" అంటూ లేని అభినయం చేస్తూ ప్రాధేయపడసాగింది సుశీల.

"నువ్వు నా సంసారం పాడు చెయ్యకు" అని చెల్లెలితో చెప్పలేక కోమలిని అడ్డం పెట్టుకుని కొంత నాటకం ఆడింది.

చంచల అలాగైనా తెలుసుకొని తన దారికి అడ్డం రాకుండా ఉంటుందని సుశీల ఆశించింది.

"మరి ఏదో ఫంక్షను ఉంది కాలేజీలో అన్నాడు కదా బావ" అంది చంచల సందేహం వ్యక్తపరుస్తూ.

"ఫంక్షను లేదూ పాడూ లేదు. ఇలాంటి ఫంక్షను పేరు చెప్పి ఆయన ప్రతివారం ఆమెను వెంటేసుకుని తిరిగి ఆమెకు కావలసినవన్నీ కొని పెడుతూ ఉంటారు" అంది సుశీల.

ఇద్దరూ కలిసి ఇంటికి వచ్చేశారు.

* * *

చంచల ఇప్పుడు పెద్ద ఆలోచనలో పడింది.

ఎంత మోసం. ఎంత దగా.

అంత అందంగా కనపడే బావలో ఇంత వంచన ఉందా?

ఇంకా నయం. ఆయన వ్యామోహంలో పడి తను మెళ్ళో తాళి కట్టించుకోలేదు. అక్క జీవితం ఎలాగూ పాడు అయిపోయింది. తన జీవితం కూడా నాశనం అయిపోయేది. తను ముందుగా మేల్కొనటం మంచిదయింది. ఇంత చదువు చదివి, ఇంత తెలివితేటలతో తను ఎలా పడిపోయింది? ఈ రోజున తన మెళ్ళో తాళి కట్టినా, రేపు మరో స్త్రీతో తిరగడని ఏముంది. ఏది ఏమైనా ఈ విషయంలో తను అదృష్టవంతురాలు కాబట్టి ముందుగానే తెలుసుకోగలిగింది.

చంచలకి క్షణంలో మైకం వదిలిపోయింది. తన చుట్టూ అలుముకున్న అంధకారం విడిపోయింది.

ఇంత జరిగిన తరువాత ఇక్కడ తను మరో క్షణం ఉండకూడదు. అంతేకాక తను మళ్ళీ బావ మాయలో పడి పోకుండా ఉండాలంటే వెంటనే వెళ్ళి పోవాలనుకొని నిర్ణయించుకుంది.

సుశీల ఎంత వారిస్తున్నా వినకుండా ఆ రాత్రికి రాత్రే బస్సు ఎక్కి చంచల తండ్రి దగ్గరకు వెళ్ళి పోయింది.

ఫంక్షను పూర్తి చేసుకుని అర్ధరాత్రి వచ్చిన మన్మథరావుకి ఉదయం నిద్ర లేచిన తర్వాత గానీ, రాత్రి చంచల వెళ్ళిపోయిందన్న సంగతి తెలియలేదు.

ముందు అనుకున్న ప్రకారం అయితే, మరో గంటలో తాము యాదగిరి గుట్ట వెళ్ళాలి.

పెళ్ళికి అంత తొందర పెట్టిన మనిషి రాత్రికి రాత్రి వెళ్ళి పోవటం ఏమిటి? అందులో చెప్పకుండా వెళ్ళటం ఏమిటి?

చంచల ఇలా ఎందుకు చేసిందో అంతుపట్టక మన్మథరావు జుట్టు పీక్కున్నాడు. బుర్ర బద్దలయ్యేలా ఆలోచించడం మొదలు పెట్టాడు.

*